

చింతలూరులో కొండచిలువ హల్‌చల్
రూ.లక్షా 5వేలు పలికిన అమ్మవారి పూలదండ 6
ములికిపల్లిలో లారీని ఢీకొని యువకుడి మృతి
చొప్పెల్ల వద్ద డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి



ముమ్మిడివరం మండలం పళ్లవారిపాలెంలో చండీదేవిగా విజయదుర్గమ్మవారు



విశేష అలంకరణలో మాణిక్యాంబ అమ్మవారు



అంబాజీపేటలో సరస్వతిదేవిగా వాసవీమాత

మహాచండీగా మాణిక్యాంబ అమ్మవారు

ద్రాక్షారామ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ద్వాదశ శక్తిపీఠం మాణిక్యాంబ అమ్మవారు దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో 7వరోజు ఆదివారం మహాచండీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయంలో మాణిక్యాంబ అమ్మవారికి విశేష కుంకుమార్చనలు, శ్రీచక్రనవావర్ణార్చన, సాయంత్రం లక్షకుంకుమార్చన, సువర్ణ, రజత పుష్పార్చన జరిపారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఆకాశం నుదిటిన సూర్య తిలకం!



గోదావరిపై సూర్యుడు వెలుగులు విరజిమ్ముతూ.. ఆకాశం నుదిటిన సూరీడు తిలకం పెట్టినట్టుగా ఈ సుందర దృశ్యం భలే ఉంది కదూ..!

యానాం గౌతమి గోదావరిపై ఆకాశంలో సూర్యాస్తమయం సమయాన సూరీడు

-ఆంధ్రజ్యోతి, యానాం



GST తగ్గేదేలే!

ఇంకనూ తగ్గని పన్నుపోటు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

జీఎస్టీ 2.0 విధానం అమల్లోకి వచ్చి వారం దాటింది. ఈ నెల 22 నుంచి సుమారు 83 కేటగిరీలకు సంబంధించిన వస్తువులు,సేవలు, మందులపై కేంద్రం జీఎస్టీ శ్లాబ్ తగ్గించిన సంగతి తెలిసిందే. గతంలో నాలుగు శ్లాబ్‌లు ఉంటే.. ప్రస్తుతం రెండు శ్లాబ్‌లకే పరిమితం చేశారు. కానీ ఎక్కడా ఇవి పూర్తి స్థాయిలో అమల్లోకి రావడంలేదు. వ్యాపారులు అసలు ధరలు చెప్పడం లేదు. పాత సరుకు ఉందనే కారణంతో పాత ధరలే వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు. ఈ పరి స్థితుల్లో పాత సరుకు ఎంత ఉందో చెప్పే వారెవరూ కనిపించడంలేదు. తగ్గిన జీఎస్టీ శ్లాబ్ వల్ల ప్రజలకు ఎప్పటికి ప్రయోజనం లభిస్తుం దనేదానిపై స్పష్టత లేదు.

దసరా ఆఫర్ల పేరు..

టీవీలు, ఏసీలు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, కార్లు, మోట్లారు సైకిళ్లపై కొంత వరకూ తగ్గినట్టు చెబుతున్నారు. కార్లపై రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ తగ్గగా మోటారు సైకిళ్లపై రూ.15 వేల వరకూ తగ్గింది. టీవీలపై రూ.3 వేల నుంచి రూ. 4 వేల వరకూ తగ్గిస్తున్నారు. కానీ ఇవన్నీ దసరా ఆఫర్లతో కలిపి అమ్ముతున్నట్టు వ్యాపారులే చెబుతున్నారు. అంటే

- ఆగని వ్యాపారుల దోపిడీ
- పాత ధరలే కొనసాగింపు
- దసరా ఆఫర్లుగా ప్రకటనలు
- ఎమ్మార్పీపై పాత జీఎస్టీ అమలు
- వారమైనా మారని పరిస్థితి
- తగ్గని పాల ప్యాకెట్ ధర
- తనిఖీలు చేపట్టని అధికారులు
- అవగాహన సదస్సులతో సరి
- మోసపోతున్న కొనుగోలుదారులు

దసరా ఉత్సవాల తర్వాత టీవీలు, ఏసీల వంటి ధరలు కొద్దిగా పెరిగే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు. సిమెంట్ ధరలు తగ్గించడం లేదు. పాల ఉత్పత్తుల వద్ద ధరల పట్టీలు పెట్టారు. కానీ పాత సరుకు ఉందని చెప్పడం గమనార్హం.

కొత్త పథకం.. పాత ధర..

ప్రభుత్వం జీఎస్టీ శ్లాబ్‌ను తగ్గించిన 83 కేటగిరీల వస్తువులు, సేవలు వంటి వాటి వివరాలు ప్రకటిం చింది.వీటి ధరలు కచ్చితంగా తగ్గించాల్సిందే. పన్నీరు, టెట్రాప్యాక్ పాలు, చపాతీలు, రోటీలపై ఐదు శాతం జీఎస్టీ ఉండేది. దానిని పూర్తిగా ఎత్తేశారు. దీంతో ఆయా వస్తువుల ధరలు తగ్గుముఖం పట్టాయి. అయితే వ్యాపారులు మాత్రం పాత ధరకే విక్ర యిస్తున్నారు.వెన్న, నెయ్యి, తృణధాన్యాలు, చక్కెర, కాఫీ, సూప్‌లు, బేకింగ్ ఫౌడర్, నిల్వ ఉంచిన చేప, మాంసం రేటపై జీఎస్టీ గతంలో 12 శాతం ఉండేది. ప్రస్తుతం కేవలం 5 శాతం వసూలు చేయాలి. 20 లీటర్ల తాగునీటి డబ్బాలు, కొబ్బరిపాలు, బాదం, జీడి పప్పు పాలు, అవిసెపాలు, బియ్యంపాలు, ఓట్ పాలు పండ్ల గుజ్జు, రసాలు, పాలు ఆధారిత పానీయా లపై గతంలో 18 శాతం జీఎస్టీ వసూలు చేసేవారు. ఈ శ్లాబ్‌ను 5కి పరిమితం చేశారు.

అసలు ఎంత తగ్గాయంటే!

- విద్యార్థులు ఉపయోగించే వ్యాయామం, ఎరేజర్లు, పుస్తకాలు, పెన్సిళ్లపై జీఎస్టీని ఎత్తేశారు.జామెట్రీ, రంగు పెట్టెలు,పేపరు కార్టూన్లు తదితర వస్తువులపై 12 శాతం ఉండే జీఎస్టీని 5 శాతానికి పరిమితం చేశారు.
- అరుదైన వ్యాధులకు సంబంధించిన మందు లపై పూర్తిగా జీఎస్టీ ఎత్తేశారు. యునాని, సిద్ధ, హోమియోపతి సహా అన్ని మందులు, ఆక్సిజన్ కిట్లు, రసాయనాలు,గ్లూకోమీటరు,సర్జికల్ వస్తువులపై 12 శాతం ఉంటే 5 శాతానికి పరిమితం చేశారు.థర్మామీటరుపై 18 శాతం ఉంటే 5 శాతానికి పరిమితం చేశారు.
- వ్యవసాయ పరికరాలు,యంత్రాలపై గతంలో 12, 18 శాతం జీఎస్టీ ఉండేది.. మొత్తం 5 శాతానికి తగ్గించారు. వ్యవసాయ సంబంధిత పరికరా లు ఏం కొన్నా 5 శాతమే వసూలు చేయాలి.
- వాహనాలపై గతంలో 28 శాతం జీఎస్టీ ఉంటే 18 శాతానికి పరిమితం చేశారు. సైకిళ్ల,వాటి భాగాలపై 12 శాతం ఉంటే 5శాతానికి పరిమితం చేశారు.
- సిమెంట్‌పై జీఎస్టీ 28 శాతం ఉంటే 18 శాతానికి పరిమితం చేశారు. మిగిలిన గృహ నిర్మాణ వస్తువులపై 12 శాతం ఉంటే 5 శాతానికి పరిమితం చేశారు.
- టీవీలు, ప్రొజెక్టర్లు, ఏసీలు, డిష్ వాషర్లపై గతంలో 28 శాతం జీఎస్టీ ఉంటే దానిని 18 శాతానికి పరిమితం చేశారు.సోలార్ వాటర్ హీటర్, సిస్టమ్స్ సోలార్ కుక్కర్లపై 12 శాతం ఉంటే 5శాతానికి పరిమితం చేశారు.
- బొమ్మలు, క్రీడాపరికరాలు, చేతిపనుల వస్తువులపై 5 శాతమే.
- ఫీడింగ్ బాటిళ్లు,స్టీల్, అల్యూమినియం, రాగి వంటి పాత్రలు, ఫీడింగ్ బాటిళ్లు, బేబీ న్యాప్ కిన్‌లు,డ్రైపర్లు, కొవ్వొత్తులు, స్టీలు, అల్యూ మినియం,రాగి ఇత్తడి,వంటగది పాత్రలు,కుట్టు యంత్రాలు, రబ్బరు బ్యాండ్లపై 12 శాతం జీఎస్టీని 5శాతానికి పరిమితం చేశారు.
- కాఫీ, చాకెట్లు, పేస్ట్రీ, కేక్‌లు, బిస్కెట్లు, జామ్‌లుపై గతంలో 18శాతం జీఎస్టీ ఉండేది.దానిని 5 శాతానికి పరిమితం చేశారు.బాదం, పిస్తా, హాజెల్ నట్స్, ఖర్జూరం, అంజీర్ మొదలైన డ్రైఫ్రూట్లు, పాస్తా,మాకరోనీ, నూడుల్స్, ఊరగాయలు, పండ్లు, కూరగాయల రసాలపై గతంలో 12 శాతంగా ఉండే జీఎస్టీని 5 శాతానికి పరిమితం చేశారు.
- సబ్బులు,హెయిర్ ఆయిల్, షాంపూలు, దువ్వెనలు, ఫౌడర్లపై జీఎస్టీ 12 నుంచి 5 శాతానికి తగ్గింది. టాల్కమ్, ఫేస్ పౌడర్, షేవింగ్ క్రీమ్, ఆఫ్టర్ షేవ్ లోషన్లపై 18 శాతం ఉంటే జీఎస్టీని 5 శాతానికి పరిమితం చేశారు. పన్ను తగ్గించినా వ్యాపారులు ఇంకా పాత పన్ను విధానమే అనుసరిస్తున్నారు.



18 వరకూ అవగాహన సదస్సులు

ఏ వస్తువుపై ఎంత జీఎస్టీ అనేది ప్రభుత్వం ప్రకటించింది. వినియోగదారులు వాటి పట్ల అవగాహన చేసుకుంటే మార్కెట్‌లో ఏ వస్తు వుకు ఎంత తగ్గిందో అడిగి కొనుక్కోవచ్చు. 22వ తేదీకి ముందు ఎమ్మార్పీని ఇవాళ ఉన్న ఎమ్మా ర్పీతో అవగాహన చేసుకుంటే వ్యాపా రులు దిగొస్తారు.లేకపోతే దోపిడీ తప్పదు. ఈ మేరకు అధికార యంత్రాంగం అవగాహన సదస్సులు చేపడుతోంది. వచ్చే నెల 18వ తేదీ వరకూ ప్రచారం ఉంటుంది.19న సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ పేరిట దీపావళిని ఒకరోజు ముందుగానే నిర్వహించనున్నారు.



కోటిపల్లి పుష్కరాల రేవులో మెట్ల వరకూ చేరిన వరదనీరు

పెరుగుతున్న గోదావరి వరద

- మునిగిన కాజ్‌వేలు
- నిలిచిన పడవ ప్రయాణాలు

అమలాపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గోదావరికి వరదలు మరోసారి ముంచెత్తాయి. దీంతో జిల్లాలోని గౌతమీ, వశిష్ఠ, వైనతేయ, వృద్ధగౌతమీ నదీపాయలు పొంగి ప్రవహించడంతో పలుప్రాంతాలకు రవాణాసౌకర్యాలు స్తంభించిపోయాయి. వరదల కారణంగా గతంలో కొట్టుకుపోయిన ముక్తేశ్వరం-కోటిపల్లి రేవు మధ్య రోడ్డు కారణంగా అప్పటినుంచే పంటు ప్రయాణాలు నిలిచిపోయాయి. ఇప్పుడు వరద ఉధృతి కారణంగా ఉభయగోదావరి జిల్లాల మధ్య సఖినేటిపల్లి-నర్సాపురం రేవు మధ్య పంటు ప్రయాణాలను ముందుజాగ్రత్త చర్యగా ఆదివారంనుంచి నిలిపివేసినట్టు నిర్వాహకులు ప్రకటించారు. వరద ఒడి తీవ్రత దృష్ట్యా పడవల్లో ప్రయాణాలు చేయవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. జిల్లాలోని పలు లంక గ్రామాలకు వరదనీరు చేరుకుంటుంది. లక్షల క్యూసెక్కుల నీటిని భద్రాచలంనుంచి విడుదల చేయడంతో జిల్లాలోఉన్న నదీపాయలు పొంగిప్రవహిస్తున్నాయి. చాకలిపాలెం-కనకాయలంక కాజ్‌వే, అప్పనపల్లి కాజ్‌వే, తొగరపాయ కాజ్‌వేతోపాటు పలు ప్రాంతాల్లోని కాజ్‌వేలు నీటమునిగి రవాణా సౌకర్యాలు స్తంభించిపోవడంవల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. భద్రాచలం, ధవళేశ్వరంవద్ద వరద తీవ్రతను దృష్టిలోపెట్టుకుని లంకగ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. పి.గన్నవరం మండలం జి.పెదపూడి వద్ద గతంలో వేసిన తాత్కాలిక రహదారి మునిగిపోవడంతో నాలుగు లంక గ్రామాల ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ ప్రయాణికులకోసం రెవెన్యూ అధికారులు లైఫ్ జాకెట్లు సమకూర్చి జాగ్రత్తలు తీసుకున్నారు.



పి.గన్నవరం మండలం పుచ్చల్లంక రేవులో పడవపై వచ్చిన కొబ్బరికాయలను ట్రాక్టర్‌పై ఎగుమతి చేస్తున్న దృశ్యం

జీఎస్టీ తగ్గింపు ఎంతో ప్రయోజనకరం

- బీజేపీ ఎంపీ పాకా సత్యనారాయణ
- వర్తకులతో అవగాహన సదస్సు



జీఎస్టీపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ సత్యనారాయణ

అమలాపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కేంద్రం అమలులోకి తెచ్చిన జీఎస్టీ తగ్గింపు వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపశమనం లభిస్తుందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ అన్నారు. 5 నుంచి 18శాతం వరకు జీఎస్టీ పన్నులు వివిధ రకాల వస్తువులపై తగ్గించడంవల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, వైద్యఆరోగ్యం, నిత్యావసర వస్తువుల ధరలు, కార్లు, మోటారుసైకిళ్ల, ఇతర అనేకరకాల కీలక వస్తువులతోపాటు బీమాపైనా పన్నులు తగ్గాయన్నారు. అమలాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న సంపూర్ణ ఫర్నీచర్ షోరూం వద్ద ఆదివారం జీఎస్టీ తగ్గింపులవల్ల వచ్చిన మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించడానికి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో వర్తకులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జీఎస్టీ వల్ల వ్యక్తుల కంటే దేశానికి ఎంతో మేలు జరిగిందని, కొవిడ్ తర్వాత ప్రపంచంలో 5వ శక్తిగా భారత్ ఎదిగిందని సత్యనారాయణ అన్నారు. 28ప్రాణాంతక వ్యాధులకు సంబంధించిన మందుల ధరలు పూర్తిగా తగ్గాయని, నిత్యావసర వస్తువుల ధరలను 18 నుంచి 5 శాతానికి తగ్గించారని, ఏడున్నర దశాబ్దాల కాలంలో ఎప్పుడూ ఈ తరహా పన్నుల తగ్గింపు జరగలేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ అధ్యక్షత వహించి జీఎస్టీ పన్నులు తగ్గింపుల కారణంగా వర్తకులు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు ప్రజలకు చేకూరుతున్న లబ్ధిని వివరించారు. సమావేశంలో బీజేపీ అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కొమ్మూరి వెంకటాచలప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు, నల్లా సుబ్బారావు(చిన్నా), నల్లా మల్లిబాబుతోపాటు బీజేపీ నాయకులు, వ్యాపార సంస్థలకు చెందిన ప్రతినిధులు ఈ అవగాహన సదస్సులో పాల్గొని చర్చించారు.

వచ్చేనెల 15 వరకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

- జిల్లా యువజన సంక్షేమాధికారి

అమలాపురంరూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడామంత్రిత్వశాఖ, రాష్ట్ర యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో అక్టోబరు 15 వరకు జాతీయస్థాయిలో ఆన్‌లైన్ క్విజ్ పోటీలు జరుగుతాయని జిల్లా యువజన సంక్షేమాధికారి డీవైసీ గోపి అన్నారు. 2026, జనవరి 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని వికసిత్‌భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దీనిలోభాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో యువతకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రవేశరుసుము లేదన్నారు. బహుళ ఎంపికల రూపంలో క్విజ్ ప్రశ్నలు ఉంటాయన్నారు. క్విజ్ పోటీల్లో ఎంపికైన అభ్యర్థులు జనవరి 12న జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూఢిల్లీలో జరిగే మెగా ఈవెంట్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తారన్నారు. యువత తమ ఆలోచనలు, ప్రణాళికలను ప్రధాన మంత్రి, క్యాబినెట్ మంత్రులు, పారిశ్రామికవేత్తలు వంటి ప్రముఖుల ముందు ఉంచి తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం లభిస్తుందన్నారు. ఆసక్తిగల యువత ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలన్నారు. వివరాలకు 9700515436 నెంబరును సంప్రదించాలన్నారు.

నేడు కలెక్టరేట్‌లో.. ప్రజాసమస్యల పరిష్కార వేదిక

అమలాపురం టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్జీదారులు దాఖలు చేసిన సమస్యలు ఇప్పటివరకు పరిష్కారం కాకపోయినా ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు 1100 నెంబరుకు డయల్ చేసి తెలుసుకోవచ్చునన్నారు. అర్జీదారులు తమ అర్జీలను నమోదు చేసుకునేందుకు మీకోసం డాట్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. అర్జీదారులు తమ సమస్యలు పరిష్కారమైనప్పుడు సంబంధిత వ్యక్తులకు ఫోన్‌లో సంక్షిప్త సందేశం వస్తుందన్నారు. నోటీసులు, ఎండార్స్‌మెంట్‌లను వాట్సాప్‌లో ఎప్పటికప్పుడు పంపిస్తామన్నారు. మండల డివిజన్, పురపాలక సంఘాల స్థాయిలో జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

నానో యూరియాదే.. భవిష్యత్తు

- అవగాహన లోపంతోనే ఇక్కట్లు
- అదే ధర.. అవే ప్రయోజనాలు
- అపోహలు వీడితే ఎంతో మేలు
- నానో యూరియాతో పంటలకు పూర్తిస్థాయిలో నత్రజని



అమలాపురం రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): యూరియా కొరత.. ఎక్కడ విన్నా ఇదే మాట. రాష్ట్రంలో పొలిటికల్ హీట్‌ను పెంచడమే కాదు శాసనమండలిలోను రగడ సృష్టించింది. కొరత లేదని ప్రభుత్వం చెప్తే మరి యూరియా కోసం రైతులు ఎందుకు క్యూ కడుతున్నారని ప్రతిపక్షాలు ప్రశ్నించాయి.

రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరత ఇసుమంతైనా లేదు. ఫెర్టిలైజర్‌ల డీలర్లు అందరి వద్ద నానో యూరియా లెక్కకు మించి సిద్ధంగా ఉంది. బస్తాలో దొరికే యూరియా కంటే నానో యూరియాతో రైతులకు మేలు జరుగుతుంది. ముందస్తుగా రైతులను ఆ దిశగా సిద్ధం చేయకపోవడంవల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంలో నానోయూరియా ఎరువుల తయారీదారులు, అధికారులు వైఫల్యం చెందారు. చేతులు కాలాకా ఆకులు పట్టుకున్న చందంగా ఇప్పుడు అధికారులు రైతులకు నానో ఎరువులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

అదే ధర.. అంతకుమించి ప్రయోజనం

50 కిలోల యూరియా ఎరువుల బస్తా ధర రూ.266. పొలానికి తీసుకువెళ్లడానికి మళ్లీ దనంగా రూ.100కుపైగా ఖర్చు. పొలంలో యూరియాను చల్లేందుకు అదనంగా మళ్లీ ఖర్చు. ఇక 500 మిల్లీలీటర్ల నానో యూరియా ధర రూ.265 మాత్రమే. అర లీటరు యూరియా డబ్బాను ఎంతో సులువుగా ఏ ఖర్చు లేకుండా రైతులు జేబులో పెట్టుకుని పొలాల వద్దకు వెళ్లవచ్చు. తక్కువ ఖర్చుతోనే పంటపై పిచికారీ చేసుకోవచ్చు. నానో యూరియాను పంట పూత, గింజ దశలో పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని మండల వ్యవసాయాధికారి కె.ప్రవీణ్ చెబుతున్నారు. యూరియా గుళికలు పంటకు పూర్తిస్థాయిలో వినియోగం ఉండదు. నానో యూరియా పూర్తిస్థాయిలో పంటకు ఉపయోగపడుతూ పర్యావరణహితంగా ఉంటుంది.

నానో యూరియాదే భవిష్యత్తు
-కె.ప్రవీణ్, మండల వ్యవసాయాధికారి

భవిష్యత్తులో రైతులందరూ నానో యూరియా ఎరువుల వైపు మారిపోవడం ఖాయం. ఒక్కసారిగా రైతుల్లో మార్పు తీసుకురాలేం. నానో ఎరువుల వినియోగంతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరిస్తున్నాం. ఒక్క ఎకరాకు అరలీటరు నానో యూరియా చాలు. దీన్ని లీటరుకు 4 ఎంఎల్ చొప్పున 120 లీటర్ల నీటిలో కలపాలి. డ్రోన్ ద్వారా అయితే ఎకరాకు 350 ఎంఎల్ నుంచి 400 ఎంఎల్ నానో యూరియా సరిపోతుంది.

నానో యూరియాతో వృథా నిల్

రైతులు అత్యధికంగా గుళికల యూరియానే వినియోగిస్తున్నారు. నానోయూరియాతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నా పాత పద్ధతినే కొనసాగించడంవల్ల సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. గుళికలు యూరియాకు బదులు నానో యూరియా వాడాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు ముందునుంచి చెప్తూనే ఉన్నారు. సాధారణ యూరియా బస్తాలోఉండే పోషకాలు అర లీటరు నానోయూరియాలో ద్రవరూపంలో ఉంటుంది. అదే తేడా. సాధారణంగా రైతులు ఉపయోగించే యూరియా 2.8 నుంచి 4 మిల్లీ మైక్రాన్లుఉంటే దానిలో మొక్కలకు 30శాతం నుంచి 50శాతం మాత్రమే చేరుతుంది. మిగిలిన యూరియా నీటిలో భూమిలో కలిసిపోయి కాలుష్యానికి కారణమవుతుంది. అదే నానోయూరియా ఉపయోగిస్తే 80శాతం పైబడి మొక్కలకు నత్రజని అందుతుందని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. సాధారణ యూరియా వేర్ల ద్వారా మొక్కలకుఅందడానికి ఆలస్యమవుతుంది. నానో యూరియా అలా స్ప్రే చేయగానే పత్రహరితానికి చేరి ప్రభావం చూపిస్తుంది.

అంతర్జాతీయ క్రీడలకు వేదికగా రాజమహేంద్రవరం

శాప్ చైర్మన్ రవినాయుడు

ముగిసిన ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్



సింగిల్స్‌లో రన్నర్‌గా నిలిచిన రావత్‌కు బహుమతి ప్రదానం



విన్నర్‌గా నిలిచిన సూర్యచరిష్మా

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ క్రీడలకు రాజమహేంద్రవరం వేదిక కావాలని శాప్ చైర్మన్ ఏ.రవినాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ బ్యాడ్మింటన్ కోర్టుల్లో నిర్వహించిన ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ - 2025 ఫైనల్స్ పోటీలు ఆదివారం సాయంత్రం జరిగాయి. విజేతలకు ముఖ్య అతిథి శాప్ చైర్మన్ రవినాయుడు, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. రవినాయుడు మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి శాప్ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి పాలనలో క్రీడాకారులకు మంచి అవకాశాలు లభిస్తున్నాయని, ఆటలకు ప్రోత్సాహం అందజేస్తున్నారన్నారు. జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి బాలసుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

మహిళల సింగిల్స్ విజేత సూర్యచరిష్మా

మహిళల సింగిల్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సూర్యచరిష్మా విజేతగా నిలిచింది. పురుషుల సింగిల్స్‌లో భరత్ రాఘవ్ విజయం సాధించాడు. మహిళల సింగిల్స్‌లో సూర్య చరిష్మా 21-14, 21-22 స్కోర్ల తేడాతో హర్యానాకు చెందిన జియా రావత్‌పై గెలుపొందింది. పురుషుల సింగిల్స్‌లో హర్యానాకు చెందిన భరత్ రాఘవ్ అదే రాష్ట్రానికి చెందిన రవిపై గెలుపొందాడు. అలాగే, పురుషుల డబుల్స్‌లో నిషాత్ దురైస్వామి (తమిళనాడు), ప్రేజాన్ జోడీ అక్షన్ షెట్టి (మహారాష్ట్ర), శంకర్‌ప్రసాద్ ఉదయ్ కుమార్ (కేరళ)పై గెలిచారు. మహిళల డబుల్స్‌లో రుతపర్న పాండా (ఒడిశా), దీప్‌షికా సింగ్(ఢిల్లీ) జోడీ పవిత్ర నవీన్, గౌరీ కృష్ణ (కేరళ) 23-21, 24-22పై విజయం సాధించారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో దీప్ రాంభియా, సోనాలి మీర్‌ఖేల్కర్ (మహారాష్ట్ర) జోడీ ధ్రువ్ రావత్ (ఉత్తర్ ప్రదేశ్), మనీషా (ఆర్‌బీఐ)పై గెలుపొందారు.

అద్వితీయం... మహాశక్తి యాగం

ఏడో రోజు శ్రీపీఠానికి పోటెత్తిన మహిళలు

వారాహీదేవిగా ఐశ్వర్యాంబిక దర్శనం



లలితా సహస్రనామ సామూహిక కుంకుమార్చనలో మహిళలు



విశేషాలంకరణలో వారాహి అమ్మవారు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ రమణయ్యపేట శ్రీపీఠం గోశాల ప్రాంగణంలో 3వ మహాశక్తి యాగం ఆదివారం ఏడోరోజుకు చేరుకుంది. ఐశ్వర్యాంబిక అమ్మవారు వారాహీదేవిగా విశేషాలంకరణలో దర్శనమిచ్చారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో అమ్మవారికి వారాహి, కీలక స్తోత్ర హోమాలను పలు విశేష ద్రవ్యాలతో నిర్వహించారు. వంద కోట్ల కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులకు శ్రీపీఠం వ్యవస్థాపకులు స్వామి పరిపూర్ణానంద సరస్వతి అనుగ్రహ భాషణ చేశారు. నిత్యం 24 నిమిషాలు కేటాయించి లలితా సహస్రనామం పారాయణం చేయడం అలవరుచుకోవాలన్నారు. కంఠస్థం, హృదయస్థం చేసిన పారాయణతో కుంకమార్చన చేస్తూ అమ్మవారిపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. లలితా నామాన్ని ఉచ్చరించే సమయంలో పొత్తి కడుపు నుంచి మెదడు దాకా నాడులు యాక్టివేట్ అవ్వడం ద్వారా ఉత్సాహంగా, ఆరోగ్యంగా జీవించడంతో పాటు కోరిన కోర్కెలు నెరవేరేలా అమ్మ అనుగ్రహం ఉంటుందన్నారు. త్వరలో సుమారు 108 అడుగుల ఎత్తులో అమ్మవారి విగ్రహంతో పాటు మహాశక్తి దీపం ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. యాగం నిర్వహణకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందు మాధవ్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు శాఖ సిబ్బంది, అధికారులు విశేషంగా సహకరిస్తున్నారన్నారు. సుమారు 35వేల మంది భక్తులు పాల్గొన్నారు. సర్పవరం సీఐ బి.పెద్దిరాజు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు పి.శ్రీనివాసకుమార్, ఆచార్యులు, సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అమ్మవారి పూలదండ రూ.లక్షా 5 వేలు!



మహిషాసుర మర్దని అమ్మవారు

అమలాపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయదశమి పర్వదినాన మహిషాసుర మర్దని అమ్మవారికి మెడలో అలంకరించే పూల దండ వేసేందుకు అనుమతి కోసం ఆదివారం ఉత్సవ కమిటీ నిర్వహించిన బహిరంగ వేలంలో ఒకరు రూ.లక్షా 5వేలకు పాట పాడి దక్కించుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రవణం వీధిలో ఉన్న శ్రీమహిషాసుర మర్దని అమ్మవారిని కి దసరా రోజు నిర్వహించే భారీ ఊరేగింపులో అమ్మవారి అలంకరణలో భాగంగా భారీ గజమాలను ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా బహిరంగ వేలం ద్వారా హైదరాబాద్‌లో ఉంటున్న ఆకుల లక్ష్మణరావు దక్కించుకున్నారు. హైదరాబాద్ నుంచి వీడియో కాల్ ద్వారా బహిరంగ వేలంలో పాల్గొని పూలదండ వేసే అవకాశాన్ని దక్కించుకున్నారు. అమ్మవారి మెడలో పూలదండవేస్తే కోరిన కోర్కెలు తీరుతాయనే నమ్మకంతో ఆరోజు దండ వేసేందుకు చాలామంది పాటలో పాల్గొని పోటీపడి దక్కించుకోవడం ఆనవాయితీగా మారింది.

జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావాలి





క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రొఫెసర్ స్వామి, పురుషుల కబడ్డీ పోటీల దృశ్యం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ స్వామి

పెదపూడి (కరప), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ప్రతిభ కనబరిచి యూనివర్శిటీకి జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కేవీ స్వామి సూచించారు. కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడలోని డీఎల్ రెడ్డి డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో నన్నయ యూనివర్శిటీ పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ యూనివర్శిటీ పరిధిలో 395 గుర్తింపు పొందిన కళాశాలలున్నాయన్నారు. ఉప కులపతి ఆచార్య ప్రసన్నశ్రీ యూనివర్శిటీలో క్రీడాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అక్టోబరు 4నుంచి 7వరకు కర్ణాటకలోని బెల్గాంలో గల రాణిచెన్నమ్మ యూనివర్శిటీలో జాతీయ స్థాయి యూనివర్శిటీల గేమ్స్-స్పోర్ట్స్ మీట్ జరగనుందని, ఇందులో నన్నయ యూనివర్శిటీ పురుషుల కబడ్డీ జట్టు ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాలని ఆకాంక్షించారు. గొల్లల మామిడాడ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ-కరస్పాండెంట్ డీఆర్కే రెడ్డి మాట్లాడుతూ కర్ణాటకలో జరిగే పోటీల్లో కబడ్డీ జట్టు గోల్డ్ మెడల్ సాధిస్తే క్రీడాకారులకు తమ సంస్థ తరఫున మంచి ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పోటీలను ప్రారంభించి సత్తా చాటిన క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీనివాసరెడ్డి, ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు ఎం.రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షురాలు ద్వారంపూడి చంద్రావతి, డీఆర్కే రెడ్డి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శివన్నారాయణరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.త్రివేణి, జీఆర్ఎస్‌పి అధ్యక్షుడు డి.భాస్కర్‌రెడ్డి, పరిశీలకుడు మూర్తి, ఎంపిక కమిటీ సభ్యులు శ్రీనివాస్‌కుమార్, శ్రీనివాసరావు, కార్యనిర్వాహకకార్యదర్శి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా యానాం వెంకన్న కల్యాణం



వెంకన్న కల్యాణోత్సవ వేడుకల దృశ్యాలు



యానాం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): యానాం ప్రజల ఆరాధ్యదైవం శ్రీభూసమేత వేంకటేశ్వరుని కల్యాణోత్సవం మంగళవారం సంప్రదాయ రీతిలో వైభవంగా జరిగింది. కల్యాణ వేడుకను కరకుదురుకు చెందిన ఆగమ పండితులు వాడపల్లి గోపాలాచార్యులు పర్యవేక్షణలో శ్రీవాసవి కన్యక పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి బాలలాయంలో శాస్త్రోంతంగా జరిగిన ఈ కల్యాణోత్సవంలో యానాం పరిపాలనాధికారి అంకిత్‌కుమార్, ఆలయ ఈవో జ్యోతి వెంకటేశ్వరరావు స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తాలంబ్రాలును సమర్పించారు. పరిసర ప్రాంతాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ట్రాక్టర్ ఢీకొని పాస్టర్ మృతి



ఏసురత్నం (ఫైల్)

గొల్లప్రోలు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దైవ ప్రార్థనల కోసం చర్చికి వస్తూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ పాస్టర్ చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని అగ్రహారానికి చెందిన దేవాది ఏసురత్నం (74) పాస్టర్‌గా ఉంటూ చర్చి ల్లో ప్రార్థనలు నిర్వహిస్తారు. గొల్లప్రోలులోని చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించేందుకు ఆదివారం ఉదయం స్కూటర్‌పై ఇంటి నుంచి బయల్దేరాడు. గొల్లప్రోలు బైపాస్‌లో వై.జంక్షన్ పెట్రోలు బంకు సమీపంలోకి వచ్చేసరికి పిఠాపురం నుంచి కత్తిపూడి వెళ్తున్న ట్రాక్టర్ అతివేగంగా వచ్చి ఢీకొంది. ఏసురత్నానికి తీవ్ర గాయాలు కాగా తొలుత పిఠాపురం అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. ఏసురత్నానికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



ఆలమూరు మండలం జొన్నాడ వద్ద మృతిచెందిన మహిళ

ఆలమూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ, చొప్పెల్ల గ్రామాల వద్ద జాతీయ రహదారిపై జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ఆలమూరు ఎస్‌ఐ జి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం పొట్టిలంక గ్రామానికి చెందిన వెలగపు సుజాత(45), భర్త సూరిబాబుతో కలసి బైక్‌పై కపిలేశ్వరపురం ఏటిగట్టుపై నుంచి వెళ్తుండగా రాజమహేంద్రవరం నుంచి రాజోలు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుకనుంచి ఢీకొంది. సుజాత తలపై నుంచి బస్సు ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఆలమూరు ఎస్‌ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలమూరు మండలం చొప్పెల్ల వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్టు ఆలమూరు ఎస్‌ఐ తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం మోరంపూడికి చెందిన పసుపులేటి వేణుగోపాలరావు (47) ప్రతీ శనివారం ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద రోజ్‌మిల్క్ వ్యాపారం చేస్తుంటాడు. శనివారం రాత్రి వ్యాపారం ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా ఆలమూరు మండలం చొప్పెల్ల వద్ద డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్టు ఎస్‌ఐ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు నమోదు చేశామన్నారు.

లారీని ఢీకొని యువకుడు..

రాజోలు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ములికిపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం కలగంపూడికి చెందిన కడలి అక్షయ్ (21) ఆదివారం మృతిచెందాడని రాజోలు ఎస్‌ఐ బి.రాజేష్‌కుమార్ తెలిపారు. వివరాల ప్రకారం.. అక్షయ్ చెన్నైలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. చెన్నై నుంచి కలగంపూడి వచ్చిన అక్షయ్ స్నేహితుడిని కలిసేందుకు కడలి మీదుగా ములికిపల్లి వెళ్తుండగా నలంద పబ్లిక్ స్కూలు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి మోహనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

డొంకరాయి జలాశయం నుంచి 5వేల క్యూసెక్కుల నీరు విడుదల



జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

మోతుగూడెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదలను ఆదివారం ఉదయం 5వేల క్యూసెక్కులకు పెంచినట్టు జెన్‌కో అధికారులు తెలిపారు. డొంకరాయి జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1037 అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 1035.60 అడుగులకు చేరుకోవడంతో జెన్‌కో అధికారులు జలాశయం ప్రమాదస్థాయికి చేరుకోకుండా 1035.60 వద్ద నీటి మట్టం స్థిరంగా కొనసాగేలా దిగువకు 3వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అయితే ఎగువున కురుస్తున్న వర్షాలకు జలాశయానికి ఇన్‌ఫ్లోస్ పెరుగుతున్న నేపథ్యంలో ఆదివారం ఉదయానికి జలాశయం నీటి మట్టం 1035.70 అడుగులకు పెరగడంతో జెన్‌కో అధికారులు నీటి విడుదలను మూడు వేల క్యూసెక్కుల నుంచి 5వేల క్యూసెక్కులకు పెంచారు. జలాశయంలోని 7వ నెంబర్ గేటును 2.90అడుగులు ఎత్తి 3వేల క్యూసెక్కులు, 6వ గేటు ద్వారా 1.84 అడుగులు ఎత్తి 2వేలు క్యూసెక్కులు మొత్తంగా 5వేల క్యూసెక్కుల నీటిని దిగువకు జెన్‌కో అధికారులు విడుదలచేస్తున్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న ముగ్గురిపై కేసు

బిక్కవోలు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు నుంచి భీమవరం వద్ద ఉండి చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను తీసుకువెళ్తున్న వ్యాన్ డ్రైవర్, క్లీనర్, ఓనర్లపై కేసు నమోదు చేసినట్టు బిక్కవోలు ఎస్‌ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు. వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున బిక్కవోలులోని కాటన్ విగ్రహం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బొలేరో వ్యాన్‌లో కోళ్ల వ్యర్థాలను గుర్తించారు. వ్యాన్ డ్రైవర్, క్లీనర్ కాకినాడ జిల్లా కాజులూరు మండలం తిప్పరాజుపాలెంకు చెందిన చెయ్యేటి నరేంద్ర, బిక్కవోలు మండలం ఆరికరేవులకు చెందిన వారా క్రాంతిలను అరెస్టు చేసి వ్యాన్ సీజ్ చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు. అలాగే వ్యాన్ యజమాని కామర్తి దుర్గాప్రసాద్‌పై కూడా కేసు నమోదు చేశామని తెలిపారు.

చింతలూరులో కొండచిలువ హల్‌చల్



ఆలమూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొండలు, అడవి ప్రాంతాల్లో ఎక్కువగా కనిపించే కొండచిలువ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరులో హల్‌చల్ చేసింది. ఆదివారం చింతలూరు కాలువ వద్ద కనిపించడంతో అక్కడ ఉన్న వారంతా ఒక్కసారిగా భయభ్రాంతులయ్యారు. చివరికి దానిని హతమార్చారు. అటవీప్రాంతంలో ఉండే కొండచలువ ఇక్కడకు రావడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కొండచలువ సుమారు 8 అడుగుల పొడవు ఉన్నట్టు తెలిపారు. అయితే కొండల వద్ద నుంచి వస్తున్న గ్రావెల్ లారీల ద్వారా కొండచలువ వచ్చి ఉండవచ్చని భావిస్తున్నారు.

రాయవరంలో ఆలయ స్థలం వివాదం

ఒక వర్గంపై రాళ్ల దాడి

గాయపడి ఒకరు మృతి, ఏడుగురికి గాయాలు



మృతిచెందిన సత్యనారాయణ (ఫైల్)



రాయవరం ముత్యాలమ్మ ఆలయం వద్ద సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

రాయవరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం పోలమ్మ ఆలయం సమీపంలో ఉన్న శ్రీముత్యాలమ్మ ఆలయం వద్ద షెడ్డు నిర్మాణం చేస్తున్న నేపథ్యంలో ఆదివారం ఆలయ సరిహద్దు ఇంట్లో ఉన్న వ్యక్తి, అతడి కుటుంబ సభ్యులు రాళ్ల దాడికి పాల్పడిన సంఘటనలో వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతి చెందగా మరో ఏడుగురు వ్యక్తులు గాయాలపాలై చికిత్స పొందుతున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయవరంలో శ్రీపోలమ్మ ఆలయం పక్కనే ముత్యాలమ్మ ఆలయం ఉంది. ఆలయ సరిహద్దులో రేలంగి నాగేశ్వరరావు అనే వ్యక్తి ఇళ్లు ఉంది. ఆలయ నిర్వహాక కమిటీకి, సరిహద్దులో ఉన్న నాగేశ్వరరావుకు గత కొన్నేళ్లుగా సరిహద్దు వివాదం నడుస్తుంది. ఆలయం వద్ద ఉన్న స్థలం తనది అంటూ నాగేశ్వరరావు, స్థలం ముత్యాలమ్మ ఆలయానిదే అంటూ ఆలయ నిర్వహాకులు చెబుతుండటంతో వివాదం నడుస్తుంది. పోలమ్మ ఆలయ నిర్వహాకులు ఆలయం వద్ద స్థలంలో రేకుల షెడ్డు నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో వివాదం జరగడంతో నాగేశ్వరరావు అతడి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిపై నుంచి కారం నీళ్లు చల్లి రాళ్లతో ఆలయ షెడ్డు నిర్మాణం చేస్తున్న కమిటీ, షెడ్డు వద్ద వ్యక్తులపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో గ్రామానికి చెందిన బోదంకి సత్యనారాయణ (51) అలియాస్ సత్తిబాబు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతిచెందాడు. మరో ఏడుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. దాడి చేసిన రేలంగి నాగేశ్వరరావు పరారీలో ఉన్నట్టు సమాచారం.

డీఎస్పీ పరిశీలన

రాయవరం ముత్యాలమ్మ ఆలయం వద్ద రాళ్ల దాడి జరిగిన ప్రాంతాన్ని రామచంద్రపురం ఇన్‌చార్జ్ డీఎస్పీ టీవీఎస్‌ఆర్‌కే ప్రసాద్ పరిశీలించారు. మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, ఎస్‌ఐ డి.సురేష్ బాబు వివాదంపై ఆరా తీశారు. రాయవరం పోలీసులు కేసు నమోదు చేయనున్నారు.

రావులపాలెం అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



అధ్యక్షుడు పోతంశెట్టి కనికిరెడ్డితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

రావులపాలెం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన చాంబర్ అధ్యక్ష,పాలకవర్గ సభ్యులు రావులపాలెం అభివృద్ధికి కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం సీఆర్సీ ఫంక్షన్‌హాలులో రావులపాలెం చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారు పాల్గొని అధ్యక్షుడు పోతంశెట్టి కనికిరెడ్డితో పాటు నూతన పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యక్తికో ఒక వర్గానికో చెందినది కాదని, అందరూ సమష్టిగా ఏర్పాటు చేసుకున్న సంఘమన్నారు. వినియోగదారులకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేయ్యాలన్నారు. చాంబర్ అధ్యక్షుడు, రాజపురస్కార అవార్డు గ్రహీత పోతంశెట్టి కనికిరెడ్డి మాట్లాడుతూ వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. పాలకవర్గ సభ్యుల సమన్వయంతో చాంబర్ భవన ఆధునీకరణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వ్యాపారులు వినియోగదారులతో సమన్వయంగా పనిచేస్తు వ్యాపారాలు సాగించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, గుత్తుల రాంబాబు, కొప్పిశెట్టి ప్రసాద్, తమలంపూడి రామకృష్ణరెడ్డి, చిన్నం శ్రీనివాసరెడ్డి, సాధనాల శ్రీను కూటమి నాయకులు పాల్గొన్నారు. చాంబర్ అధ్యక్షుడిగా నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన పోతంశెట్టి కనికిరెడ్డిని వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి దుశ్శాలువాతో సత్కరించారు. ఆయన వెంట కర్రి నాగిరెడ్డి తదితరులున్నారు.

ఆకర్షణీయంగా..

అల్లూరి జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక ప్రధాన సెంటర్‌లో తమిళనాడుకు చెందిన వివిధ జాతుల రకాల పక్షులను విక్రయిస్తున్నారు. ఫ్రెంచ్, టర్కీ బాతులు, కడకనాథ్, చీటా కోళ్లు, గిన్నె కోళ్లు ఉన్నాయి. దీంతో వీటి కోసం చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. - ఎటపాక (ఆంధ్రజ్యోతి)



డార్మెటరీ ప్రారంభం

మలికిపురం,సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): మలికిపురంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు నూతనంగా నిర్మించిన బాలాజీ ఎన్‌క్లేవ్ డార్మెటరీని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి అమూల్య, ముప్పర్తి నాని, చాగంటి స్వామి పాల్గొన్నారు.

నేడు నగర పంచాయతీ సమావేశం

ముమ్మిడివరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్టు కమిషనర్ పి.రవివర్మ పేర్కొన్నారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 గంటలకు కౌన్సిలర్ సమావేశం జరుగుతుందని, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు విధిగా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

గోదావరికి వరద ఉధృతి.. ప్రజల ఇబ్బందులు

- లంక గ్రామాల్లోకి వరద నీరు
- పడవలపై ప్రజల ప్రయాణం



ముమ్మిడివరం: లంకాఫ్ ఠాణేలంక వద్ద వరదనీటిలో అంబేడ్కర్‌నగర్, ముక్తేశ్వరం తొగరపాయలో నీట మునిగిన పాత వంతెన

ముమ్మిడివరం, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): వరద ఉధృతి పెరగడంతో మండలంలోని లోతట్టు లంక ప్రాంతాల్లోకి వరదనీరు ప్రవేశించింది. గురజాపులంకకు వెళ్లే ప్రధాన రహదారి కూనాలంక నుంచి గురజాపులంక వరకు నీట మునిగింది. వరదనీరు సిమెంటు రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. కూనాలంక వద్ద రామాలయం వద్ద సిమెంటు రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. లంకాఫ్ ఠాణేలంకలోని అంబేడ్కర్ కాలనీలో వరద నీరు ప్రవేశించింది. మండలంలోని లంక ప్రాంతాల్లోని లోతట్టు ప్రదేశాల్లో వరదనీరు ప్రవేశించింది. ఇంటర్నల్ రోడ్లు వరద నీటితో మునిగాయి. లోతట్టు ప్రాంతాల్లోని నివాస గృహాలను వరదనీరు చుట్టుముట్టింది. లంకాఫ్ ఠాణేలంక, గురజాపులంక, కూనాలంక, లంకాఫ్ గేదెల్లంక తదితర లంక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు వరదనీట మునిగాయి. తహశీల్దార్ టి.సుభాష్ లంక ప్రాంతాల్లో పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు. వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు స్థానికంగా ఉండి పరిస్థితిని సమీక్షించాలన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేశారు.

మళ్లీ పోటెత్తిన గోదావరి వరద

అయినవిల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వదర మళ్లీ పోటెత్తింది. గౌతమీ, వృద్ధ గౌతమీ పాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అయినవిల్లిలంక కాజ్‌వే పైకి వరదనీరు రావడంతో ప్రజలు పడవలపై ప్రయాణాలు సాగిస్తున్నారు. ముక్తేశ్వరం తొగరపాయలపై పాత వంతెన నీట మునిగింది. పుష్కర ఘాట్లు నీట మునిగాయి. ఈసీజన్‌లో నాలుగోసారి వరద రావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా శ్రావణమాసం, భాద్రపద మాసాల్లో వరదలు రావడం సహజం. ఆశ్వయుజ మాసంలో వరదలు రావడం వల్ల పంటల సాగుకు ఆలస్యం అవుతుందని తీర ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అప్పనపల్లి కాజ్‌వేపై వరదనీరు

మామిడికుదురు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల గోదావరికి వరద పోటెత్తడంతో అప్పనపల్లి కాజ్‌వేపై వరదనీరు చేరింది. గోదావరికి రెండు నెలల వ్యవధిలో మూడోసారి కాజ్‌వే ముంపు బారిన పడడంతో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాజ్‌వేపై వరద నీరు చేరడంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నం లంక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతూ ప్రయాణాలు చేస్తున్నారు. బాలబాలాజీ దర్శనానికి వచ్చే భక్తులు భయాందోళనల మధ్య కాజ్‌వేపై ప్రయాణాలుచేసి స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఆయా లంక గ్రామాల్లోని కూరగాయల తోటలు, పశుగ్రాసం, ముంపు బారిన పడడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పనపల్లి స్నానాలరేవు వద్ద పాశర్లపూడి వైనతేయ వారధి కింద గోదావరి పరవళ్లు తొక్కుతూప్రవహిస్తోంది.పాశర్లపూడి బాడవలోనిగోదావరి నదీతీరంలో వేంచేసి ఉన్న కనకదుర్గమ్మవారి ఆలయంలోకి స్వల్పంగా వరదనీరుచేరడంతో భక్తులు వరదనీటిలోనే అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నారు.

గోదావరి వరద తగ్గుతూ.. పెరుగుతూ..

పి.గన్నవరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద తగ్గుతూ.. పెరుగుతూ... లంక గ్రామస్తులను నానా అవస్థలకు గురిచేస్తుంది. లంక ప్రాంతాల్లో ఉన్న కూరగాయలు పూర్తిగా దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. గోదావరి ఎగువన భారీగా వర్షాలు పడటంతో దిగువన నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ధవళేశ్వరం నుంచి దిగువన సముద్రంలోకి 10లక్షల క్యూసెక్కులు దాటి వరద నీటిని క్రిందికి వదులుతున్నారు. పి.గన్నవరం మండలం చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వే వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు వరద ఉధృతి కారణంగా దొడ్డిపట్ల రేవును తాత్కాలికంగా మూసేశారు. గంటిపెదపూడి వద్ద బూరుగులంక నదీపాయపై పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక, ఉడిమూడిలంక గ్రామస్తులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు పశ్చిమ గోదావరి జిల్లా అనగార్లంక, పెదమల్లంక గ్రామస్తులు నాటుపడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. బూరుగులంక రేవు, పుచ్చల్లంక రేవుల వద్ద వ్యవసాయ ఉత్పత్తులు, నిత్యావసరాలు ఇవతలి ఒడ్డుకు తీసుకురావడానికి రైతులు అవస్థలు పడుతున్నారు.

కనకదుర్గ ఆలయాల్లో హోమాలు, అభిషేకాలు




మామిడికుదురు: ఐశ్వర్యలక్ష్మీగా శ్రీమహాలక్ష్మి, పి.గన్నవరం: గంటిపెదపూడిలో కాత్యాయనీదేవిగా శ్రీమసేనమ్మ తల్లి, కాట్రేనికోన: కుండలేశ్వరంలో కనకదుర్గ

అల్లవరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అల్లవరం కనకదుర్గ ఆలయం వద్ద మంగళంపల్లి పాండురంగ విఠల్ బ్రహ్మత్వాన మేడిశెట్టి మల్లిబాబు, సంగుల బ్రహ్మాజీ కర్తలుగా దుర్గా చండీ హోమాలు జరిగాయి. గోడితిప్ప కనకదుర్గ ఆలయం వద్ద గణపతి హోమం, చండీ హోమం, రుద్ర హోమాలు నిర్వహించారు. తుట్టిపు సూర్యప్రకాశరావు సోదరులు, బసవా కుటుంబీకులు విన్నా సత్యం, నార్ని వెంకటేష్ ఆర్థికసాయంతో అన్నసమారాధనలు జరిగాయి. డి.రావులపాలెం, బెండమూర్లంక, కొమరగిరిపట్నం, గోడిలంక, బోడసకుర్రు తదితర గ్రామాల్లో దుర్గాలయాల వద్ద కుంకుమ పూజలు జరిగాయి.

మహాచండీదేవికి పూజలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): చినకొత్తలంక గ్రామంలోని శ్రీపట్టాభిరామ స్వామివారి ఆలయంలో అమ్మవారు మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీవారు అమ్మవారిని నిమ్మకాయలు, పూలతో మహాచండీదేవిగా అలంకరింపచేసి ప్రత్యేక పూజలు జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పల్లవారిపాలెంలోని శ్రీవిజయదుర్గమ్మవారు చండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ వారు అమ్మవారిని పలు రకాల గాజులతో అలంకరింపచేసి ప్రత్యేక పూజలు జరిపించారు. ముమ్మిడవరంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఆదివారం చండీ హోమాన్ని నిర్వహించారు. ఆదివారం ఆలయం వద్ద చండీ హోమం నిర్వహించి ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు.

ఐశ్వర్యలక్ష్మిగా దర్శనం

మామిడికుదురు,సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో వేంచేసి ఉన్న శ్రీమహాలక్ష్మి అమ్మవారు ఆదివారం ఐశ్వర్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం అమ్మవారి ఆలయాల్లో పలు పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మామిడికుదురులో వేంచేసి ఉన్న శ్రీవిజయదుర్గమ్మ వారికి గులాబీలతో విశేష అలంకరణ జరిపారు. పెదపట్నంలంకలోని కనకదుర్గమ్మ కాళరాత్రి అవతారంలో, పాశర్లపూడిబాడవలోని మహాచండీ అలంకరణలో భక్తులకు సాక్షాత్కరించారు. నగరం, మొగలికుదురు, పెదపట్నం, పాశర్లపూడిలంక, గోగన్నమఠం గ్రామాల్లో పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆయా చోట్ల ఆలయాలను విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీమహాచండీదేవిగా శ్రీమసేనమ్మ తల్లి

పి.గన్నవరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గంటిపెదపూడిలో శ్రీమసేనమ్మ శ్రీమహాచండిదేవిగా దర్శన మిచ్చారు. స్థానికంగా వేంచేసి ఉన్న శ్రీవైష్ణవి కనకదుర్గ అమ్మవారు శ్రీలలితా త్రిపురసుందరి దేవిగా దర్శనమిచ్చి ప్రత్యేక పూజలందుకున్నారు. పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెంలో శ్రీకనకదుర్గమ్మకు ప్రత్యేక అభిషేకాలు, సాముహిక సహస్ర కుంకుమార్చనలు నిర్వహించిన అనంతరం శ్రీమహాచండీదేవిగా దర్శనమిచ్చారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. గ్రామాల్లో శ్రీకనకదుర్గ ఆలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక కుంకుమార్చనలు, పూజాకార్యక్రమాలు నిర్వహించారు.

వివిధ అలంకరణలో అమ్మవార్లు

యానాం,సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): యానాం శివారు గిరియాంపేట రోడ్డులోని శ్రీపాల కనకదుర్గమ్మ అమ్మవార్ని ఆలయ అర్చకులు రాయప్రోలు కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో కాత్యాయనీదేవిగా ఆలకరించి విశేషపూజలు నిర్వహించారు. పడవలరేవు వీధిలోని లలితాదేవి సరస్వతీదేవిగా, గోపాల్‌నగర్‌లోని శారదాదేవి (సరస్వతి) లక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సరస్వతీదేవిగా వాసవీమాత

అంబాజీపేట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవార్ని ఆదివారం సరస్వతిదేవిగా అలకరించారు. అనంతరం అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవార్కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అంబాజీపేట సంతమార్కెట్‌లో ఉన్న శ్రీవిజయకనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాచవరం, గంగలకుర్రు పెదగరువులో విద్యార్థులు సరస్వతి పూజ నిర్వహించారు. ఇరుసుమండలో విజయకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహాచండీగా మావుళ్లమ్మ

కాట్రేనికోన, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మావుళ్ళమ్మ ఆదివారం చండీదేవి రూపంలో, చెయ్యేరు గ్రామదేవత దాసులమ్మ శ్రీమహాలక్ష్మిదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆణివిళ్ల ఫణికాంత్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఈకార్యక్రమాల్లో నంద్యాల పెద్దకాపు దంపతులు, నంద్యాల వెంకటరెడ్డి దంపతులు, నంద్యాల శివ, నంద్యాల తాతాజీ, కె.శివ పాల్గొన్నారు. కుండలేశ్వరంలో కనకదుర్గ ప్రత్యేక అలంకణలో దర్శనమిచ్చారు. కాళ్ళకూరి కామేశ్వరరావు పూజలు నిర్వహించారు.

అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ


వెండి కిరీటాన్ని బహూకరిస్తున్న శ్రీనివాసరాజు

అంతర్వేది, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిలో ఉన్న కనకదుర్గమ్మవారికి దండు శ్రీనివాసరాజు-అరుణకుమారి దంపతులు రూ. 1.80లక్షల విలువైన 1200 గ్రాముల రెండు వెండి కిరీటాలను బహూకరించారు. వీటిని ఆలయ అర్చకులు సంప్రోక్షణ అనంతరం అమ్మవారికి అలంకరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ జంపన బుజ్జిరాజు, ఉపసర్పంచ్ ఇందుకూరి రమేష్‌రాజు, ముదునూరి ప్రసాద రాజు, నడింపల్లి చంటిరాజు పాల్గొన్నారు.

అంతర్వేదిలో భక్తుల కిటకిట

అంతర్వేది, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రానికి భక్తులు బారులు తీరారు. తొలుత క్షేత్ర సంరక్షకుడు ఆంజనేయస్వామి, క్షేత్ర పాలకుడు పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామిలను భక్తులు దర్శించుకున్నారు. అనంతరం లక్ష్మీనరసంహస్వామిని దర్శించుకున్నారు. క్యూలైన్‌లో ఉన్న భక్తులకు ఆలయ సిబ్బంది తాగునీరు సరఫరాచేసి సేవ లందించారు. స్వామివారి ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. అంతర్వేది సైకిల్‌షాపు సెంటర్, కేశవదాసుపాలెం, మోరి, వీవీమెరక, సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంక, రామేశ్వరం, గొంది గ్రామాల్లో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

రామకృష్ణ మృతి తీరని లోటు

మామిడికుదురు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం మాజీ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ మృతి పార్టీకి తీరని లోటని పలువురు వక్తలు కొనియాడారు. రామకృష్ణ సంతాప సభ నగరం గ్రామంలో ఆదివారం జరిగింది. బాలబాలాజీ దేవస్థానం చైర్మన్‌గా ఆయన అందించిన సేవలను పలువురు కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. గన్నవరపు శ్రీనివాసరావు, కుసుమ శ్రీధర్, జక్కంపూడి వాసు, కడలి శ్రీనివాస్, నెల్లి దుర్గాప్రసాద్, కాంద్రేగుల బాబి, తులా గోపాలకృష్ణ, వాసంశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

అసెంబ్లీలో రాజోలు సమస్యలు ప్రస్తావించిన ఎమ్మెల్యే

నాయకుల అభినందనలు

మలికిపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): శంకరగుప్తం డ్రెయిన్ గురించి, ప్రజల తాగునీటి సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రజలకు బాసటగా నిలిచారని సెంట్రల్ డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే దేవను అభినందించిన వారిలో రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య, రాజోలు ఎంపీపీ కడలి శ్రీదుర్గ, కడలి మోహన్, చాగంటి స్వామి, కాకి లక్ష్మణ్, రత్నమాల, గోవిందు, శరత్‌రాజు, విక్కి, కిట్టు, సాయి తదితరులు ఉన్నారు.

మహిళా సమానత్వం కోసం పోరాడిన అంబేడ్కర్

ముమ్మిడివరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మహిళా సమానత్వం కోసం పోరాడిన వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రిపబ్లికన్ పార్టీ నాయకుడు పెనుమాల సుధీర్ పేర్కొన్నారు. అన్నంపల్లి పంచాయతీ పరిధిలోని రాంజీనగర్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ అంబేడ్కర్ 1951 ఫిబ్రవరి 5న హిందూకోడ్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి మగవారితో సమానంగా మహిళలకు ఆస్తి హక్కును కల్పించారన్నారు. అంబేడ్కర్ చేసిన పలు కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్.పృథ్విరాజ్, టి.దుర్గబాబు, పి.శ్రీనివాస్, జి.రమేష్, శరత్ పాల్గొన్నారు.

మునిపల్లిలో గో-వృషభ కల్యాణం


గోవృషభ కల్యాణం జరిపిస్తున్న పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప దంపతులు

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మునిపల్లి శ్రీపార్వతీమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, అనూరాధ దంపతులు గోవృషభ కల్యాణం జరిపించారు. సామర్లకోటకు చెందిన తిరుమళ్ళ శేషకుమార్‌శర్మ శాస్త్రోక్తంగా కామ్యవృషోత్సర్జనం జరిపించారు. చినరాజప్ప దంపతులు హిందూ ధర్మశాస్త్ర ప్రకారం కల్యాణానికి ముందు హోమం నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రాలతో గోవృషభ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈకల్యాణం వల్ల పితృదేవతలు సంతృప్తి చెందడంతో పాటు పల్లెసీమలు పాడిపంటలతో అభివృద్ధి చెందుతాయని శాస్త్రాల్లో ఉన్నట్టు శేషకుమార్‌శర్మ వివరించారు. ఆలయ అర్చకుడు కొమానపల్లి కాశీవిశ్వనాథ్ సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో వేళంగి బాబితో పాటు పలువురు పండితులు పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నిమ్మకాయల సత్యనారాయణమూర్తి, ఎంపీటీసీ నిమ్మకాయల రాము, సొసైటీ మాజీ చైర్మన్ నిమ్మకాయల జగ్గయ్యనాయుడు, మాజీ సర్పంచ్ నూకల సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన

ముమ్మిడివరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు ప్రతీ ఒక్కరూ దూరంగా ఉండాలని ఎస్ఐ డి.జ్వాలాసాగర్ సూచించారు. అన్నంపల్లి పంచాయతీ పరిధి చింతపల్లిలంకలో టీడీపీ మండలాధ్యక్షుడు అర్థాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు

ఎల్పీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

22జట్లతో మూడు రోజుల పోటీలు

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగే లక్ష్మీనారాయణ మెమోరియల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. టోర్నీ స్పాన్సర్ నాగులపల్లి రాజు పోటీలను ప్రారంభించారు. మొదటి మ్యాచ్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, అమలాపురం రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్ ప్రారంభించారు. జనసేన నాయకుడు ఉప్పలగుప్తానికి చెందిన నాగులపల్లి రాజు ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీల్లో జిల్లా పరిధిలో 22 జట్లు పాల్గొంటున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కాగా మొదటి రోజు 12జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు చిక్కం ఉమేష్, మంచెం బాలకృష్ణ, ఎస్ఐ సీహెచ్ రాజేష్, రవణం మధు, చిక్కం వెంకటకృష్ణ, కోడి శివ, సలాది గణపతి, చిక్కం కాసు, అరిగెల నరేష్, సలాది నాగరాజు, వోలా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేద ఆర్యవైశ్యులకు వడ్డీ లేని రుణాలు

అంబాజీపేట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవార్ని ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెనుగొండ వాసవీమాతకు ప్రభుత్వం తరపున పసుపు, కుంకుమ చీరపెట్టే సంప్రదాయం చంద్రబాబు తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలోని అన్ని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాల్లో ఈసంప్రదాయం కొనసాగించాలని కోరారు. పేద ఆర్యవైశ్యులకు వడ్డి లేని రుణాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. ఆయననుఆర్యవైశ్య నాయకులు సత్కరించారు.

బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


రక్తదానంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

అమలాపురం, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పుట్టినరోజు సేవా కార్యక్రమంలో భాగంగా అమలాపురం పట్టణంలోని బుద్దాల బ్లడ్ బ్యాంకులో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, బీజేపీ అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్, మాకిరెడ్డి మనోజ్, నాగిరెడ్డి స్వామి, మంచిగంటి రామకృష్ణ, మాకిరెడ్డి శివరామకృష్ణ రక్తదానం చేశారు.బీజేపీ యువమోర్చా నాయకుడు గనిశెట్టి అరవింద్, అల్లవరం, అయినవిల్లి మండల శాఖల అధ్యక్షులు కట్టా నారాయణస్వామి, యలమంచిలి వెంకటరమణ, పొలమూరి వెంకట్, డీవీఎస్ రాజు, కొండేటి జయలక్ష్మి, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రసాదరావుకు జాషువా పురస్కారం

కాట్రేనికోన, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జీకేడీ ప్రసాదరావుకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పింగళి వెంకయ్య కళావేదికపై పర్యాటక, సాంస్కృతికశాఖా మంత్రి కందుల దుర్గేష్ గుర్రం జాషువా అవార్డు ప్రదానం చేశారు. రూ.50వేల నగదు, ప్రశంసాపత్రం ఇచ్చి సన్మానించారు. ప్రసాదరావు 2011లో దళిత జర్నలిజం గ్రంథం, దళిత ప్రశ్నకు సంబంధించిన వ్యాస సంపుటిని వెలువరించారు. దళిత సంబంధిత సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక అంశాల మీద వివిధ పత్రికల్లో వందకు పైగా వ్యాసాలు రాశారు. ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్‌లో ఫ్యాకల్టీగా చేస్తున్నారు.

నవయుగ కవి చక్రవర్తి జాషువా జయంతి

అమలాపురం రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. మడికి సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం కామనగరువులో అసోసియేషన్ వ్యవస్థాపకుడు మడికి శ్రీరాములు స్వగృహం వద్ద జాషువా జయంతిని నిర్వహించారు. ఏపీసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మడికి శ్రీరాములు, తెన్నేటి రాజబాబు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం చదలవాడ జయరావు, డివిజన్ సంఘ అధ్యక్షుడు మట్ట నాగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు నేదునూరి నతానియేలు, సవరపు నానిబాబు, ప్రముఖ కవులు సీలి సంసోను, ముమ్మిడివరపు వెంకటేశ్వరరావు, రాగి వెంకటేశ్వరరావు, వీధి దుర్గారావు, నవుండ్రు లక్ష్మణరావు, నేదునూరి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుల వివక్షతను ఎలుగెత్తి చాటిన జాషువా

కుల వివక్షతను ఎండగట్టిన మహనీయునిగా గుర్రం జాషువా చరిత్రలో నిలిచిపోతారని రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ పేర్కొన్నారు. వడగాల్పులు నా జీవితమైతే వెన్నెల నా కవిత్వం వంటిదని చాటిన గొప్ప కవిగా కీర్తించారు. బీజేపీ జిల్లాశాఖ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం కిమ్స్ వైద్య కళాశాలలో గుర్రం జాషువా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్, జిల్లాశాఖ మాజీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శులు చీకురుమెల్లి శ్రీనివాసరావు, కొపనాతి దత్తాత్రేయ, సలాది వీరబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి వెంకటేశ్వరరావు, చికలమర్రి కస్తూరి, అనంతలక్ష్మి, కార్యదర్శులు రమావర్మ, ఆదిలక్ష్మి, బీజేపీ పదాధికారులు, డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి, కిమ్స్ జనరల్‌మేనేజర్ శర్మ పాల్గొన్నారు.

కోడిపందాల శిబిరంపై దాడి

అంతర్వేది, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి పోలీసు స్టేషన్ పరిధి మూడు తూములు కొబ్బరి తోటలో కోడిపందాలపై పోలీసులు దాడి చేశారు. ఏడుగురు పందెం రాయుళ్లను అరెస్టుచేసి 8,150 నగదు, రెండు పందెం కోళ్లను సీజ్ చేసినట్టు తెలిపారు. అంతర్వేదిపాలెంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని రూ.3750 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

అల్లవరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): బోడసకుర్రులో దసరా ఉత్సవాలు, ఊరేగింపు ప్రశాంతంగా జరుపుకోవాలని కమిటీ నిర్వాహకులకు ఎస్ఐ బి.సంపత్ కుమార్ సూచించారు. బోడసకుర్రులోఉత్సవకమిటీలు, గ్రామస్తులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. దూకుడుగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.దొమ్మేటి శ్యామ్‌ప్రకాష్, అడపా శ్రీనివాసరావు, కమిటీల నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ పుస్తకం ఆవిష్కరణ

ముమ్మిడివరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జి పొన్నాడ సతీష్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ ఆదివారం డిజిటల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రభుత్వం వల్ల పడుతున్న ఇబ్బందులు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈపుస్తకంలో నమోదు చేయాలన్నారు. కాశి బాల మునికుమారి, చెల్లుబోయిన శ్రీనివాసరావు, పెన్మెత్స చిట్టిరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్‌ను వినియోగించుకోవాలి

పి.గన్నవరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ చర్యలతో ఇబ్బందులు పడితే వైసీపీ నాయకులు, కార్యకర్తలు డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్ అన్నారు. పోతవరం పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆయన విడుదల చేశారు. అసెంబ్లీలో మాజీ సీఎం జగన్‌పై చేసిన వ్యాఖ్యలకు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను సస్పెండ్ చేయాలని గన్నవరపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం త్రిరోడ్ సెంటర్లో నిరసన చేపట్టి అనం తరం ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, మందపాటి కిరణ్‌కుమార్, దొమ్మేటి వెంకటేశ్వరరావు, పీకే రావు, మద్దుల వరలక్ష్మి, అన్నాబత్తుల ఆనంద్ మెల్లం మహాలక్ష్మిప్రసాద్ పాల్గొన్నారు.

పుణ్యక్షేత్ర దర్శిని యాత్రికులకు స్వాగతం

ఐ.పోలవరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వీరేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో పుణ్యక్షేత్ర దర్శిని యాత్రికులకు ఆదివారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ స్వాగతం పలికారు. టెంపుల్ టూరిజంలో భాగంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఏపీఎస్ఆర్టీసీ పుణ్యక్షేత్ర దర్శిని కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగా మురమళ్ళ వీరేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన యాత్రికులకు ఘన స్వాగతం లభించింది. ప్రతి ఆదివారం వాడపల్లి వెంకటేశ్వరస్వామి, ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి, కుండలేశ్వరం, మురమళ్ళ, ముక్తేశ్వరం, అయినవిల్లి, వానపల్లి, పలివెల ఆలయాలను భక్తులు దర్శించుకునే అవకాశం ఉంటుంది.

ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గం

పి.గన్నవరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం పి.గన్నవరం సమితి యూనిట్ పంచాయతీరాజ్ ఎంప్లాయిస్ యూనియన్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా పంచాయతీరాజ్ సబ్‌డివిజన్ సీనియర్ అసిస్టెంట్ ఎస్‌డీఎల్‌వీవీ ప్రసాద్, కార్యదర్శిగా సీనియర్ అసిస్టెంట్ కె.జయలలిత, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా టైపిస్ట్ ఎన్.విజయ్‌శ్రీతేజ, జిల్లా కౌన్సిలర్‌గా పంచాయతీరాజ్ సబ్‌డివిజన్ జూనియర్ అసిస్టెంట్ ఎం.మురళీధర్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ఎం.గోవింద్, పీవీఎస్ భాస్కర్ వ్యవహరించారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

మహా చండీ నమోస్తుతే

వాడవాడలా దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఆయా ఆలయాల్లో అమ్మవార్లు పలు అలంకరణల్లో దర్శనమిచ్చారు. మరోవైపు భవానీ భక్తులతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి భక్తజనం పోటెత్తారు




ఆత్రేయపురం మండలం ఉచ్చిలిలో మహా చండీదేవిగా దర్శనమిచ్చిన విజయ కనకదుర్గమ్మ. పక్క చిత్రంలో కొత్తపేట మండలం ఏనుగుమహల్‌లోనున్న శ్రీచక్ర మహామేరు అమ్మవారు

ఆత్రేయపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవరోజు ఆదివారం మండలంలోని ఆయా అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉచ్చిలి కాలువ రేవులో ఉన్న విజయదుర్గమ్మ అమ్మవారు మహా చండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవార్ల ఆలయాల్లో కుంకుమ పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మహిళలు, భవానీ దీక్షదారులు ప్రత్యేక పూజలు చేశారు.

చెముడులంకలో హోమం

అలమూరు, (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల్లో భాగంగా చెముడులంకలో ఆదివారం చండీ హోమం నిర్వహించారు. చెముడులంక కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన శరన్నవరాత్రి ఉత్సవాల వద్ద వేద పండితులు ఈ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారు మహా చండీదేవిగా దర్శనమిచ్చారు. చింతలూరు నూకాంబిక అమ్మవారితోపాటు ఆలమూరు, చొప్పెల్ల, మడికి, చెముడులంక, మూలస్థానం, జొన్నాడ, పెనికేరు, నర్సిపూడి, నవాబుపేట, గుమ్మిలేరు, పెదపళ్ల, చింతలూరు, సూర్యారావుపేట, పినపళ్ల, సంధిపూడి, కలవచర్ల గ్రామాల్లోని శరన్నవరాత్రి ఉత్సవ ప్రతిమల వద్ద అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కపిలేశ్వరపురంలో...

కపిలేశ్వరపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లూరు గ్రామంలో పార్వతీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం చండీహోమం జరిగింది. గ్రామానికి చెందిన వల్లూరు వీరబాబు, జానకీరత్నం దంపతులతో మాగాపు సురేష్ శర్మ, కొమాళ్ళపల్లి మహేష్‌శర్మల పర్యవేక్షణలో గణపతి, చండీ హోమాలను వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి కుంకుమ పూజలు

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగుమహల్ శ్రీచక్ర మహామేరు అమ్మవారికి ఆదివారం దేవీ నవరాత్రులను పురస్కరించుకుని కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు అమ్మవారి ఆలయానికి వచ్చి మహామేరు యంత్రాన్ని పూలతో అలంకరించి కుంకుమ పూజలు చేపట్టారు. వీటిని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ జయకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

విజయవాడకు భవానీ భక్తుల పాదయాత్ర

రాయవరం, (ఆంధ్రజ్యోతి): రాయవరం రామాలయం వద్ద ఉన్న దుర్గాదేవి పీఠం వద్ద నుంచి ఆదివారం భవానీ మాలధారులు విజయవాడకు పాదయాత్ర చేపట్టారు. తొలుత కురుపూడి మణికంఠ, గోపికృష్ణ గురుస్వాముల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం విజయవాడకు 12 మంది భవానీ మాలదారులు పాదయాత్ర చేపట్టారు.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు పురస్కరించుకుని అమ్మవారి ఆలయాల్లో ఆదివారం సామూహిక కుంకమ పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈతకోట జాతీయ రహదారి చెంతనే ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన సామూహిక కుంకమ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రావులపాలెం కాలువగట్టు చెంతనే ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవార్కి అర్చనలు, అభిషేకాలు సామూహిక కుంకమపూజలు ఘనంగా జరిగాయి. అమ్మవార్ని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

పుణ్యక్షేత్ర దర్శనానికి ఆర్టీసీ బస్సు

రావులపాలెం,(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఆర్టీసీ డిపో నుంచి పుణ్యక్షేత్ర దర్శనానికి ఆదివారం మొదటి బస్సు బయలుదేరినట్టు డిపో మేనేజర్ వైవీఎస్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఉదయం 6 గంటలకు బస్సులు బయలుదేరుతుందన్నారు. రావులపాలెం నుంచి ఒకటి, వాడపల్లి నుంచి ఒకటి నడుపుతామని ప్రచారం చేసినప్పటికి ప్రతి శనివారం కూడా వాడపల్లి నుంచి బస్సు ఏర్పాటు చేయాలని భక్తులు కోరడంతో ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సు వాడపల్లి వేంకటేశ్వరస్వామి, ర్యాలి జగన్మోహిని కేశవస్వామి, కుండలేశ్వరం కుండలేశ్వరస్వామి, మురమళ్ళ వీరేశ్వరస్వామి, ముక్తేశ్వరం క్షణముక్తేశ్వరస్వామి, అయినవిల్లి వినాయక ఆలయం, వానపల్లి పళ్లాలమ్మ, పలివెల ఉమాకొప్పేశ్వరస్వామి దర్శనాల అనంతరం తిరిగి అదే రోజు సాయంత్రం రావులపాలెం డిపోకు చేరుకుంటుందన్నారు.



రావులపాలెం మండలం ఈతకోటలో కనక దుర్గమ్మకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రహదారుల నిర్మాణంతో అభివృద్ధి సాధ్యం

మంత్రి సుభాష్

ద్రాక్షారామ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక, వ్యవసాయ రంగాల అభివృద్ధిలో రోడ్లు కీలకపాత్ర పోషిస్తాయని మంత్రి సుభాష్ అన్నారు. ఆదివారం వెల్ల ఆంజనేయస్వామి ఆలయం వద్ద రామచంద్రపురం నుంచి ఉండూరు వరకు చేపట్టిన రహదారి అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో రహదారులు, భవనాల శాఖ డీఈఈ సూర్యనారాయణ, జేఈ వెంకట రమణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఎంపీటీసీ చిక్కాల స్వామికాపు, మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు, సోమేశ్వర, వేణుగోపాలస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ అన్యం జానకి రామయ్య, టీడీపీ నాయకుడు ఎ.నారాయణరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

నిలకడగా గోదావరి ఉధృతి

ఆలమూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ఉధృతి నిలకడగా కొనసాగుతోంది. మండలంలోని లంక గ్రామాల్లో వరద నీరు లోతట్టు ప్రాంతాలకు చేరుకుంది. ప్రస్తుతం నిలకడగా కొనసాగడంతో ప్రమాదం ఉండదని అధికారులు భావిస్తున్నారు. మరింత పెరిగితే వాణిజ్య పంటలకు ఇబ్బంది ఏర్పడుతుందని రైతులంటున్నారు. బడుగువానిలంక, జొన్నాడ వద్ద పుష్కర్‌ఘాట్‌లోకి వరదనీరు చేరుకుంది. జొన్నాడ రెండు బ్రిడ్జిల మధ్య వరద ఉధృతంగా ప్రవహిస్తున్నది. లంక గ్రామాల లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూలస్థానం వద్ద తోకలంకకు వరద అధికం కావడంతో జలదిగ్బంధంలో ఉంది.

కోటిపల్లి వద్ద గోదావరి ఉధృతి

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో గోదావరి నది కోటిపల్లి వద్ద ఉధృతగా ప్రవహిస్తున్నది. స్థానిక పుష్కరాలు రేవు, ఫెర్రీ రేవులు వరద నీటిలో చిక్కుకున్నాయి.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

మండపేట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండలం మాచర గ్రామానికి చెందిన గుబ్బల శ్రీనువాసు అనారోగ్యంతో బాధపడుతున్నారు. పేద కుటుంబానికి చెందిన శ్రీనువాస్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోగా వైద్యులు రూ.18 లక్షల మేర అవుతాయన్నారు. వైద్యం చేయించుకునే స్తోమత లేక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయగా రూ.9 లక్షలు మంజూరు చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో బాధితుడి కుటుంబ సభ్యులకు మంజూరైన సాయాన్ని అందజేశా రు. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుడాల జయబాబు, గొడవర్తి సత్యనారాయణ, కె.భగవాన్, అడపా సత్తిబాబు, సి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

రావులపాలెం సుందరీకరణకు కృషి

రావులపాలెం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్ సుందరీకరణకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. ఆదివారం రావుపాలెం కళా వెంకట్రావు సెంటర్ వద్ద సుందరీకరణ పనులను ఆయన పరిశీలించారు. కోనసీమ, వాడపల్లి ముఖద్వారం ఏర్పాటు పనులు, కళా వెంకట్రావు విగ్రహం తదితర ప్రాంతాలను ఆయన నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కళా వెంకట్రావు సెంటర్‌ను సుందరీకరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే సెంట్రలైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్ స్వాగతం పలుకుతూ గుర్తుండిపోయేలా అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటానన్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్న యువకులు పోలీసులకు అప్పగింత

మండపేట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దూకుడుమెట్టకు వెళ్లే దారిలో శనివారం అర్ధరాత్రి ఆరుగురు యువకులు వాహనాలను ఆపి బెదిరింపులకు పాల్పడుతుండగా కాలనీకి చెందిన వారు వారిని పట్టుకుని మండపేట రూరల్ పోలీసులకు అప్పగించారు. పట్టుబడ్డ ఆరుగురిలో నలుగురు ఇంటర్ చదువుతున్న యువకులు కాగా మరో ఇద్దరు మేజర్లుగా పోలీసులు గుర్తించారు. వారంతా ద్వారపూడికి చెందిన వారేనని వారికి నేరచరిత్ర లేదని రూరల్ ఎస్‌ఐ కిషోర్ చెప్పారు. పట్టుబడ్డ యువకులకు కౌన్సిలింగ్‌ను ఇచ్చి ఆదివారం వారి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఆయన తెలిపారు. ద్వారపూడి, కేశవరం గ్రామల్లో చీకటి పడితే చాలు యువత గంజాయి మత్తులో రోడ్డుపై తిరుగుతూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ద్వారపూడి రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో గంజాయి మత్తులో వారు రైలు దిగి వచ్చేవారిని బెదిరింపులకు పాల్పడుతుండటంతో ప్రయాణికులు, మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నట్టు తెలిసింది. పోలీసులు మెట్ట, శివారు ప్రాంతాలు, మెయిన్ సెంటర్లలో గస్తీ పెంచి వారి ఆగడాలనుఅదుపు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చేనేత కార్మికుల రిలే దీక్ష

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చేనేత సంఘాల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం అంగర చేనేత సహకార సంఘం కార్మికులు ఆదివారం సంఘం కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడారు. బకాయిల కారణంగా వడ్డీల భారం ఎక్కువ కావడంతో నష్టాల బారినపడి తమకు పని కల్పించలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి తమ బకాయిలను ఇప్పించి తమకు జీవనోపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన చేనేత కార్మికులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు

వెంకన్న బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహిద్దాం

ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ఆత్రేయపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణ ఆహ్వాన పత్రికను ఆయన ఆవిష్కరించారు. అక్టోబరు 10వ తేదీ నుంచి 18 వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యేకు ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు వివరించారు. స్వామివారిని దర్శించుకుని విజయవంతంగా వాటిని నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆహ్వాన పత్రిక ఆవిష్కరణలో నూతన చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కె.గంగవరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పామర్రు ఎస్‌ఐ ఎస్.కె. జానీబాషా అన్నారు. ఆదివారం రాత్రి కె.గంగవరం ప్రధాన కూడలిలో ఆయన ఆధ్వర్యంలో జన జాగృతి ప్రచార రథం ద్వారా ప్రజలకు అవగాహన కలిగించారు. అధిక సంఖ్యలో ప్రజలు వీటిని తిలకించారు.


అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. స్వామివారి అన్నదాన ట్రస్టుకు ఇరగవరం మండలం పితానివారిపాలెంకు చెందిన బొంతు వెంకట సత్యనారాయణ, మీరమ్మ దంపతులు రూ.80,116 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

వెంకన్న ఆలయ సిబ్బందికి ఈపీఎస్, ఆరోగ్య బీమా

వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుమారు 350 మంది వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. వారికి జీతాలు పెంచడంతో పాటు ఈపీఎస్, ఆరోగ్య బీమా కల్పించాలని ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావుతో చర్చించారు. ఈ విషయాన్ని కమిషనరు రామచంద్రమోహన్ దృష్టికి తీసుకుని వెళ్లగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఎమ్మెల్యే బండారు కృషితో సిబ్బంది జీవితాలలో దసరా వేళ వెలుగులు నిండాయి. ఆదివారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వాడపల్లిలో పర్యటించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమీక్షించారు. ఆలయంలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి ఈపీఎస్, రూ.20 లక్షల బీమా కల్పిస్తున్నట్లు సిబ్బంది హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఎంప్లాయిమెంట్ ప్రావిడెంట్ ఫండ్ కింద 12 శాతం దేవస్థానం భరిస్తుందని ఉద్యోగుల జీతం నుంచి 13 శాతం కట్ అవుతుందని తెలిపారు. ఉద్యోగుల కుటుంబ సభ్యులకు రూ.20 లక్షల ఆరోగ్య బీమాను వర్తింపచేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే బండారుతో పాటు నూతన చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావులను సిబ్బంది గజమాలలతో సత్కరించారు.

దుర్గాదేవి అవతారంలో విజయదుర్గ అమ్మవారు



రాయవరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఏడవ రోజు ఆదివారం వెదురుపాక విజయదుర్గ అమ్మవారు దుర్గాదేవి అవతారంలో పూజలు అందుకుంది. పీఠం వేద పండితులతో వేకువజాము నుంచే అమ్మవారికి పంచద్రవ్యాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. అమ్మవారికి భక్తులతో దుర్గా అష్టోత్తర సహస్రనామాలు, దేవీశక్తిమాల, దుర్గా ద్వాత్రింశ నామావళి, లక్ష్మి, సరస్వతి అష్టోత్తరాలతో కుంకుమ పూజలు జరిపారు. తొలుత వినాయకపూజ, నవగ్రహ అర్చనలు, భవానీశంకర అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం జరిపారు. ఈసందర్భంగా లలితా, విష్ణు, సామూహిక పారాయణలు, సువాసినిలతో పూజలు, అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు, నిర్వహించారు. ఈసందర్భంగా పీఠాధిపతి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పీఠంలో డాక్టర్ టీవీ నారాయణరావు చేసిన ఆధ్యాత్మిక ప్రసంగం ఆకట్టుకుంది. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవా సమితి సభ్యులు బి.రమ, జి.సత్యవెంకట కామేశ్వరి, భాస్కరనారాయణ, పి.సత్య కనకదుర్గా, బుజ్జి, పీఠం పీఆర్వో బాబి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన: వెదురుపాక విజయదుర్గా పీఠంలో రాజమహేంద్రవరానికి చెందిన నృత్య గురువు పద్మ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన చిన్నారులు పీఠాధిపతి గాడ్ సమక్షంలో చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీనివాసుడు, పద్మావతి కల్యాణం వివరిస్తూ చేసిన నృత్య ప్రదర్శనతో పాటు సుమారు 10 గీతాలను ఆలపిస్తూ చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. నాట్య గురువుతో పాటు నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులను పీఠాధిపతి గాడ్ అభినందించారు.



చిన్నారుల నృత్య ప్రదర్శన